జనసేన కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణంలోని 23వ వార్డుకు చెందిన జనసేన కార్యకర్త ఉల్లి దేవుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలోనే బాధిత కుటుంబానికి శనివారం రాజానగరంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా రూ.5 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కూడా చైర్మన్ తుమ్మల బాబు, వార్డు జనసేన ఇన్‌ఛార్జ్‌లు సతీష్, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న మంత్రి మనోహర్

ఎరుపెక్కిన రాజమహేంద్రి

- ఉత్సాహంగా ప్రారంభమైన సిపిఎం జిల్లా మహాసభ
- నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ
- చైతన్యాన్ని నింపిన నాయకుల ప్రసంగాలు

కోటిపల్లి బస్టాండ్ వద్ద జరిగిన బహిరంగ సభలో సిపిఎం నాయకులు సంఘీభావం

ఎర్ర జెండాలతో చారిత్రాత్మక రాజమహేంద్రవరం నగరం ఎరుపెక్కింది. రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతుతో నగర వీధులు అరుణార్ణవాన్ని పులుముకున్నాయి. మున్సిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకూ నిర్వహించిన ప్రజా ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. ప్రదర్శన అగ్ర భాగాన 24 జెండాలను పట్టుకుని రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు ప్రత్యేక ఆకర్షణగానిలిచింది. తీన్‌మార్ దప్పులు, ప్రజల నినాదాలతో దద్దరిల్లింది. ప్రజానాట్య మండలి కళాకారులు గీతాలు ఉత్సాహపరచగా... సిపిఎం తూర్పుగోదావరి జిల్లా మహాసభ శనివారం ప్రారంభమైంది.

:: ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి ::

కందుకూరి స్ఫూర్తితో విశాల ఉద్యమాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు

ప్రముఖ సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం స్ఫూర్తితో విశాల పోరాటాలకు ప్రజలు సంసిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా మహాసభలో భాగంగా కోటిపల్లి బస్టాండ్ వద్ద జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షతన బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం లౌకిక తత్వంవైపా? సనాతన ధర్మం వైపా? అనేదే ప్రజలకు చెప్పాలన్నారు. బాల్య వివాహాలు, సతీసహగమనం వంటి దురాచారాలకు వ్యతిరేకంగాను, వితంతు పునర్వివాహాల కోసం, బాలిక విద్య కోసం కందుకూరి చేసిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్ పక్షాన బిజెపి అనుసరిస్తున్న విధానాలు వీటన్నింటికీ వ్యతిరేకమన్నారు. సనాతన ధర్మాన్ని భుజాన వేసుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చాతుర్వర్ణ వ్యవస్థను సమర్థిస్తారా..? అని నిలదీశారు.

రాజకీయ చైతన్యంతోనే ప్రత్యామ్నాయం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

రాజకీయ చైతన్యంతోనే ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటవుతుందని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఆరు నెలల్లోనే చంద్రబాబు పాలన ఘోరంగా విఫలమైందన్నారు. అనేక హామీలతో ప్రజలను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. పాలకులు మారినా ప్రజల కష్టాలు మారలేదన్నారు. అవినీతిలో గత ప్రభుత్వంతో కూటమి ప్రభుత్వం పోటీ పడుతున్నారని. ప్రత్యామ్నాయ విధానాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం మరింత పెరగాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు సిపిఎం ఒక్కటే ప్రత్యామ్నాయమని తెలిపారు.

ప్రజా సమస్యలపై చొరవ చూపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ప్రజా సమస్యపై పాలకులు చొరవ చూపాలని జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పడి రెండున్నరేళ్లు గడిచినా ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు నిధులు కేటాయించలేదన్నారు. ఫలితంగా ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు అనేక వ్యయప్రయాసలతో బొమ్మూరులోని తాత్కాలిక కలెక్టరేట్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. వ్యవసాయంపై అత్యధికంగా ఆధారపడిన ఈ జిల్లాలో సాగుకు ప్రోత్సాహం కరువైందన్నారు. నిడదవోలు, ఉండ్రాజవరం, గోదావరి డెల్టాలో పంట నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదని విమర్శించారు. జిల్లాలో 31 పరిశ్రమలు ఉన్నాయని కరోనా అనంతరం వేతన ఒప్పందం అమలు చేయడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. ఒఎన్‌జిసిలో కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. పేపరు మిల్లు యాజమాన్యం సైతం చేసిన వేతన ఒప్పందాన్ని అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరిగి పదేళ్లు గడిచిందన్నారు. ప్రజల నుంచి వసూళ్లు చేసిన పన్నులు ప్రత్యేకాధికారి పాలనలో ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. తాగునీటికి, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించకపోగా గత ప్రభుత్వం ఆహ్లాదం పేరుతో కోట్లు రూపాయల నిధులను దుర్వినియోగం చేసిందన్నారు. 2027 పుష్కరాలకు సుమారు 2 కోట్ల మంది వస్తారని పాలనా యంత్రాంగం అంచనా వేస్తుందన్నారు. నగరంలో ఇప్పటికే ప్రజల అవసరాలకు తగ్గట్లుగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవటంతో చిన్నపాటి వర్షాలకే ముంపునకు గురౌతుందని గుర్తు చేశారు. నగరాభివృద్ధిపై దృష్టి సారించకపోతే ఆగస్టులో వచ్చే వరదలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలున్నాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు, జువ్వల రాంబావబు, కెఎస్‌వి.రామచంద్రరావు, వై.బేబిరాణి, పి.తులసి, బి.పవన్, ఎన్.రాజా, సీనియర్ నాయకులు ఎస్ఎస్ మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, టిఎస్.ప్రకాష్, ఐద్వా నాయకులు జరీనా, వెంకటలక్ష్మి, సిపిఎం నగర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

30న వామపక్షాల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 30న వామపక్షాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కాకినాడ సుందరయ్య భవన్‌లో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ అధ్యకతన వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజుబాబు తదితరులు మాట్లాడారు. పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్ పట్ల అమిత్ షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అంబేడ్కర్ అభిమానులను, ప్రజాస్వామికవాదులను అవమాన పరిచే విధంగా అమిత్ షా వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. అమిత్ షా వ్యాఖ్యలతో రాజ్యాంగం పట్ల బిజెపి వైఖరి ఏమిటో దేశప్రజలకు మరోసారి అర్థమైందన్నారు. ప్రధానమంత్రి మోడి కూడా అమిత్ షాను వెనకేసుకు రావడం శోచనీయమన్నారు. అమిత్ షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. పార్లమెంట్ అమిత్ షాను బర్తరఫ్ చేయాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నా యన్నారు. 30వ తేదీన జిల్లా కేంద్రం, డివిజన్ కేంద్రా లు, మండల కేంద్రాల్లో వామపక్షాలు నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో అంబేడ్కర్ అభిమానులు, ప్రజాస్వామిక వాదులు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. కలెక్టరేట్ వద్ద 30వ తేదీ ఉదయం 10 గం నుంచి మధ్యాహ్నం 1 గం వరకు నిరసన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు కొల్లి రవి, రైతు కూలీ సంఘం నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషబాబ్జీ, ఎం.రాజశేఖర్, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - జగ్గంపేట

ఏలేశ్వరం మండలం చిన్నంపేట జీడిపిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలని కోరుతూ ఆ ఫ్యాక్టరీ కార్మికులు శనివారం స్థానిక టిడిపి కార్యా లయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు రొంగల ఈశ్వంరావు మాట్లాడుతూ అకస్మాత్తుగా చిన్నంపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ యాజమాన్యం పరిశ్రమను మూసివేసిందన్నారు. 409 మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యను వివరించారు.

ధర్నా చేస్తున్న జీడిపిక్కల కార్మికులు

మోడల్ పేపర్స్ అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమౌతున్న విద్యార్థులకు మోడల్ పేపర్ బుక్స్‌ను బహుకరించారు. శనివారం మండలంలోని ఉండూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యుటి ఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన మోడల్ పేపర్ బుక్కులను ఉచి తంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హైస్కూల్ హెచ్ఎం ఎం.కూర్మా రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు మొబైల్, టీవీలకు అతుక్కుపోకుండా ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధపడి విజయాలు సాధించాలని దాతలు కాపవరం ఎంపిపి పాఠశాల హెచ్ఎం అద్దంకి వెంకన్నబాబు, ఉపాధ్యాయుడు కోడూరి నాగేశ్వర రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.జాన్‌ప్రసాద్, ఆర్‌వి.రమణమూర్తి, సిహెచ్‌వివి.కృష్ణమూర్తి, సిహెచ్.నాగరాజు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మెటీరియల్‌ను అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

విద్యుత్ ఛార్జీల పెంపు పాపం జగన్‌దే

ప్రజాశక్తి - పిఠాపురం

నాటి సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన అవినీతి వల్లే విద్యుత్ భారాలు పెరిగాయని, ఆ పాపం జగన్ దేనని మాజీ ఎంఎల్‌ఎ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్‌విఎస్ఎన్.వర్మ అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ఐదేళ్ల పాలనలో పది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారనన్నారు. స్లాబ్‌ల కుదింపు, స్లాబ్‌ల సవరణ, ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు పేరుతో వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.32,166 కోట్ల భారాలను ప్రజలపై మోపారని అన్నారు. వారు చేసిన తప్పులను కూటమి ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నమే వారి ఆందోళన అని అన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కోతలు లేకుండా, రైతులకు నాణ్యమైన విద్యుత్తును 9 గంటల ఉచితంగా అందిస్తున్నా మన్నారు. వైసిపి నేతలు అన్నీ తెలుసుకుని మాట్లాడలే తప్ప తమ ప్రభుత్వం పైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మైలవరం సోలార్ ప్లాంట్‌లో చట్ట విరుద్ధంగా పిపిఎలను రద్దు చేయడంతో తక్కువ రేటుకి వచ్చే విద్యుత్ ఉత్పత్తిని కోల్పోయామని అన్నారు. పోలవరం జల విద్యుత్ కేంద్రాన్ని 2021లోనే పూర్తి చేయకపోవడం వల్ల రూ.4,737 కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. విద్యుత్ సంస్థలపై రూ.49 వేల కోట్లు అప్పు తీసుకుని ఒక కొత్త విద్యుత్ ప్లాంట్‌ను కూడా నిర్మించలేదన్నారు. మీరే ఛార్జీలు పెంచి, మీరే ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ఎస్.గంగాధర్, కొండేపూడి ప్రకాష్, ఎన్.శ్రీను, బషీర్‌బాబు, ఎం.నాగమరిడిరాజు, వి.సురేష్, సుబ్బారావు, ప్రకాష్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - కోటనందూరు, పెద్దాపురం

అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపిడిఒ జోహార్‌బాబుపై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం నాడు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అన్ని శాఖల అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడిఒ పి.వెంకటనారాయణ మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఎంపిడిఒపై దాడి చేయడం అమానుషమని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. **పెద్దాపురం** స్థానిక ఎంపిడిఒ డి.శ్రీలలిత ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

కిశోర బాలికల సంరక్షణే లక్ష్యం

ప్రజాశక్తి - కరప

కిషోర బాలికలు సంరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యంగా భావించాలని సిడిపిఒ వై.లక్ష్మి అన్నారు. శనివారం స్థానిక చంద్రన్న సమావేశ భవనంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిషోర బాలిక వికాసంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర బాలికల సమస్యల పరిష్కారం, లింగ వివక్షత, ఆత్మ రక్షణ, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల అరికట్టుట, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, నాణ్యమైన విద్య, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా అంశాలపై ప్రభుత్వ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంపై తొలుత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎస్ శ్రీనివాసరావు, ఎంఇఒ పి .సత్యనారాయణ, రీసోర్సుపర్సన్లు లక్ష్మీప్రకాశ్, మల్లీశ్వరి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు వై.విజయలక్ష్మి ఎ.అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

వర్కుషాపులో మాట్లాడుతున్న సామ్రాట్ నిద్దర్

మెకానికల్ విభాగంలో వర్కుషాపు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'క్యాడ్/కెం/సిఇఎ' అనే అంశంపై శనివారం వర్కుషాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ముఖ్య అతిథి రఘు సామ్రాట్ నిద్దర్ పరిశ్రమల్లో 'క్యాడ్/కెం/సిఇఎ' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు లేవనెత్తిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌డివివిఎస్.భీమేశ్వర రెడ్డి, అధ్యాపకులుపాల్గొన్నారు.

చెక్‌ను అందజేస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

బాధిత కుటుంబానికి మంత్రి ఆర్థిక భరోసా

ప్రజాశక్తి - కాజులూరు

బాధిత కుటుంబానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక భరోసా కల్పించారు. మండలంలోని సలపాక గ్రామంలో హత్యకు గురైన బత్తుల రమేష్ భార్య బత్తుల శ్రీవల్లి భర్తను కోల్పోయి, 8 నెలల బాలుడితో ఉన్న ఆమె ఆర్థిక ఇబ్బందులు పడుతుంది. ఈ నేపథ్యంలో సర్పంచ్ గనిరాజు, మాజీ సర్పంచ్ పోతురాజు భీమారావు ఆమె పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన వ్యక్తిగతంగా రూ.50 వేలను బాధితురాలికి అందజేశాయని సంబంధిత చెక్కును సర్పంచ్‌కు అందజేశారు.

వెంకన్నదొర కుటుంబానికి ముద్రగడ పరామర్శ

ప్రజాశక్తి - రౌతులపూడి

బలరామపురం మాజీ సర్పంచ్ సోమరౌతూ భాస్కర వెంకన్న దొర కుటుంబాన్ని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం శనివారం పరామర్శించారు. ఇటీవల కాలంలో వెంకన్నదొర మృతి చెందారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ముద్రగడం ఆయన కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, మాజీ సర్పంచ్ అంకంరెడ్డి సతీష్‌కుమార్, వైసిపి నాయకులు వాసిరెడ్డి భాస్కర్‌బాబు, వాసిరెడ్డి జమీలు, డిసిసిబి మాజీ డైరెక్టర్ పులి మధు, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముద్రగడ

మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు

ప్రజాశక్తి - గండేపల్లి

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి తీరనిలోటని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మరోతి శివగణేష్ అన్నారు. శనివారం మండలంలోని నీలాద్రి రావుపేట గ్రామంలో శ్రీ కిరణ్ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులతో కలిసి మన్మోహన్ సింగ్‌కి నివాళులర్పించారు. ఆయన మృతికి నివాళిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా సంస్థలకు కనీసం ఒక్కరోజు సెలవు ప్రకటించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీవత్సవాయి సత్యనారాయణరాజు, ఎపిసిసి ప్రధాన కార్యదర్శి డాక్టర్ నక్క సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు నేదూరి భాస్కరరావు. పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు

కార్టూ'నిజం'



సిహెచ్‌సిలో జెసి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక సిహెచ్‌సిలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా శనివారం తనిఖీలు చేపట్టారు. రెవెన్యూ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన జెసిని స్థానిక నాయకులు దడాల బుజ్జిబాబు, జక్కల ప్రసాద్ సామాజిక ఆస్పత్రిలోని సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ విధుల్లో లేకపోవడం, మరో ఇద్దరు వైద్యులు పలు కారణాలతో హాజరుకాకపోవడంపై డ్యూటీ డాక్టర్ సిరిల్‌ను ప్రశ్నించారు. ముగ్గురు సెలవులో ఉన్నారని చెప్పడంతో జెసీ అసహనం వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో సైతం వైద్యులు పూర్తిస్థాయిలో ఉండడంలేదని పలువురు జెసీ దృష్టికి తీసుకొచ్చారు. ఆసుపత్రి ల్యాబ్‌లో రూ.80వేల విలువైన ఎలక్ట్రోలైట్ ఎనలైజర్ యంత్రం మాయమైందని, ఆ కారణంగా పలు వైద్య పరీక్షలు చేయడం లేదని వారు తెలిపారు. దీనిపై ల్యాబ్ టెక్నీషియన్‌ను ప్రశ్నించగా ఆ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. సిహెచ్‌సికి వచ్చిన కేసులను కాకినాడ జిజిహెచ్‌కు రిఫర్ చేస్తున్నారని, కనీసం గర్భిణులకు కాన్పులు సైతం చేయడం లేదన్నారు. దీంతో ఆయన ఆయా సంబంధిత రికార్డులను తనిఖీ చేసి ఎందుకు రిఫర్ చేయాల్సి వస్తుందని సిబ్బందిని ప్రశ్నించారు. గత రెండు నెలలుగా అనస్తీషియన్ వైద్యుడు లేకపోవడంతో సీరియస్ కేసులను కాకినాడ తరలిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. మెడికల్ ఫిట్ నెస్, గెజిటెట్ సంతకాలకు రూ.300 నుంచి రూ. 500 వరకు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సిబ్బంది పనితీరు మార్చుకోవాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు వాకపల్లి చిరంజీవి, ఉంగరాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జెసి రాహుల్‌మీనా

మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బజార్

మెప్మా బజార్ ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో సామర్లకోట - పెద్దాపురం రోడ్డులోని స్టేట్ బ్యాంకు వద్ద శనివారం మెప్మా అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు తయారు చేసిన పలు ఉత్పత్తులను ఈ మార్కెట్లో విక్రయానికి ఉంచారు. మహిళలను ఆర్థికంగా ఆదుకునే కార్యక్రమంలో భాగంగానే ఈ మెప్మా అర్బన్ మార్కెట్ ను ఏర్పాటు చేసినట్లు మెప్మా కార్యాలయ సిటీ మిషన్ మేనేజర్ సయ్యద్ హుస్సేన్ చెప్పారు. ఈ మార్కెట్లో వస్త్రాలు, తినుబండరాలు, అల్లికల వస్తువులు, పలు డ్రై ఫ్రూట్స్ విక్రయానికి ఉంచగా, పట్టణంలోని ప్రజా ప్రతినిధులతో పాటు, ప్రజలు పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఒలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

31న కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈ నెల 31న నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ టి.రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయం సమావేశపు హాలులో ఛైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరుగుతుందని, కావున కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యాలయ అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

హెచ్ఐవి బాధితులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కట్టమూరు పుంతలోని కల్వరి మిరాకిల్ చర్చిలో శనివారం హెచ్ఐవి బాధితులకు క్రిస్మస్ సందర్భంగా నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రేస్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు డాక్టర్ కోర్నలియస్ మాట్లాడుతూ ప్రతి నెల వీరికి నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ లంక పురుషోత్తం దాస్, జయబాబు, ప్రసాద్, సమర్పణ, మేరీ రాజకుమారి, వైజ్ ప్రాజెక్టు ప్రెసిడెంట్ మల్లి, జార్జి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్‌ను ఢీకొన్న కారు

ప్రజాశక్తి - పిఠాపురం

మండలం ఎఫ్‌కె పాలెం గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపూడి నుంచి మోటార్ సైకిల్‌పై అన్నదమ్ములు ఎం.రాజ్‌కుమార్, వసంతకుమార్ జల్లూరు మీదుగా భోగాపురం గ్రామంలో బంధువుల ఇంటికి వస్తున్నారు. వారిని ఎఫ్‌కె పాలెం వద్ద పిఠాపురం నుంచి సామర్లకోట వెళ్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వైద్యం నిమిత్తం వారిని స్థానికంగా ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక అదశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 7 గంటలు చేబ్రోలు గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక పిఠాపురం కాలేజీకి వెళ్లింది. అయితే సాయంత్రానికి తిరిగి ఆమె ఇంటికి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో శనివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీడర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. మండలంలోని చదలాడ గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 400 లీటర్లు, సూరంపాలెం గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేసామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు చిట్టిబాబు, ప్రసాదరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని చొల్లంగి వద్ద జాతీయ రహదారి 216పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్ఐ పి. సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ ఏటిమొగకు చెందిన పాలెపు వీరబాబు మట్లపాలెంలోని తన అత్తవారింటికి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. చొల్లంగి రైస్ మిల్ సమీపంలో ఎదురుగా యానం నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న కోరంగి ఎస్ఐ. పి. సత్యనారాయణ క్షతగాత్రున్ని 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

12 మంది బైండోవర్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు. వీరందరినీ సీతానగరం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ వద్ద హాజరుపరిచి సత్ప్రవర్తనతో ఉండేలా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. బైండోవర్ ఉత్తర్వులు ఉల్లంఘించి ప్రవర్తిస్తే వారిపై రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ, చట్టవిరుద్ధ పనులు చేసేవారిగా గుర్తుస్తూ తదుపరి చర్యలు తీసుకోంటామని హెచ్చరించారు.

ఆసుపత్రిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అనారోగ్యంతో ఒక వ్యక్తి మృతి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అతని ఆరోగ్యం విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పోలీసు తెలిపిన వివరాలు ప్రకారం. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన గణేష్ మార్ఘూ వ్యవసాయ పనులు చేసుకునేందుకు తోటి కూలీలతో కలిసి ఈనెల 23వ తేదీన తన స్వగ్రామం నుంచి వచ్చాడు. 25వ తేదీన వరి నాట్లు వేసేందుకు వెళ్లగా నీరసంగా ఉండటంతో పని చేయకుండా సాయంత్రం వరకు వారితోనే ఉన్నాడు. సాయంత్రం తోటి కూలీలతో కలిసి మకాం వద్దకు వచ్చాడు. తరువాత అతను కన్పించలేదు. తోటి కూలీలు, అతిని కోసం వెతికినా ఆచూకీ తెలియలేదు. 27వ తేదీ శుక్రవారం ఉదయం కట్టుంగ గ్రామ పరిధిలోని గన్నవరం కాలువ సమీపంలో ఒక వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు అపస్మారక స్థితిలో ఉన్న అతనిని గణేష్ మార్ఘూగా గుర్తించి కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్యం విషమించడంతో శుక్రవారం రాత్రి 10.30 గంటలకు మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

ఆవేదన... ఆందోళన...

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ వారంలో కురిసిన వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేశాయి. రైతులు ధాన్యం ఆరబెట్టుకునే సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యం మరోసారి తేటతెల్లమైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5.50 లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగిన విషయం విదితమే. కోనసీమ, కాకినాడ జిల్లాల్లో వర్షం ప్రభావం అధికంగా ఉంది. ఆరుగాలం కష్టించి పంట చేతికొచ్చే నాటికి కురిసిన అకాల వర్షాల ఫలితంగా నష్టాలు తప్పడం లేదనే ఆవేదన రైతుల్లో వ్యక్తమైంది. కల్లాలలోని ధాన్యం ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు ఇబ్బందులు తప్పలేదు. వ్యవసాయ ఆధారిత ఈ జిల్లాలో అత్యధిక మంది సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. పాలక ప్రభుత్వాలు అన్నదాతల సమస్యలపై చిత్తశుద్ధి లోపించింది. గతంలో బరకాలు పంపిణీ జరిగేది. ఆరేళ్లుగా ఆ దిశగా ప్రయత్నం జరగలేదు. మరో వైపు కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. దిగుబడుల్లో కొనుగోలు లక్ష్యం 60 శాతానికి మించడం లేదు. కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు అడ్డుగోడలుగా మారుతున్నాయి. దీంతో రైతులు దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. నూతన ప్రభుత్వమైనా అన్నదాతలను ప్రోత్సహించే దిశగా అడుగులు వేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

జీడిపిక్కల కార్మికుల ఉద్యమం ఉధృతం

చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ మూసివేతతో కార్మికులు చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. రెండు నెలలుగా కార్మికులు శాంతియుతంగా నిరసనలు తెలిపినప్పటికీ పాలనా యంత్రాంగం జోక్యం చేసుకోకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. ఆందోళన కార్యక్రమాలలో భాగంగా ప్రతిపాడు ఎంఎల్‌ఎ ఇంటి వద్ద చేపట్టిన ఆందోళనలను పోలీసులు భగ్నం చేసేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. తమ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ఆందోళనలపై ఎంఎల్‌ఎ సమాధానం ఇవ్వాలంటూ కార్మికులు ఆందోళనలను కొనసాగించారు. దీంతో ఎట్టకేలకు ఎంఎల్‌ఎ తన నివాసం నుంచి బయటకు వచ్చి కార్మికులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చిస్తామంటూ హామీ ఇవ్వడంతో కార్మికులు ఎంఎల్‌ఎ ఇంటి ఎదుట ఆందోళన విరమించారు. రాజమమహేంద్రవరంలోని ఎపి పేపరు మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘాలతో కలెక్టరు అధ్యక్షతన జరిగిన సమావేశంలోనూ యాజమాన్య మొండి వైఖరి తేటతెల్లమైంది. కార్మిక సంఘాల ప్రతినిధులు వివరించిన సమస్యలపై ప్రజా ప్రతినిధులు ఏకీభవించారు. ఎపి పేపరు మిల్లుయాజమాన్యం కార్మికుల వేతన ఒప్పందంపై సానుకూలంగా స్పందించటంతో పాటు ప్రభుత్వానికి పన్ను బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు.

విద్యుత్ ఉద్యమం మరో మైలు రాయి

విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు మిన్నంటాయి. విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ ఎన్నికల ముందు కూటమి తరపున టిడిపి అధినేత చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం విదితమే. అధికారంలోకి వచ్చిన 6 నెలలో విద్యుత్ ఛార్జీలు పెంచి తన వైఖరిని దర్పణం పట్టారు. ఈ నేపథ్యంలో తాజాగా చలికాలంలోనూ విద్యుత్ బిల్లులు అధికంగా రావటంతో ప్రజలలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజా ఆందోళనల నేపథ్యంలో ప్రతిపక్ష వైసిపి కూడా ఆందోళన బాటపట్టింది. విద్యుత్ ఛార్జీలపై జిల్లావ్యాప్తంగా ఆందోళనలను నిర్వహించింది. ఈ కార్యక్రమాలకు ప్రజాభాగస్వామ్యం క్రమ క్రమంగా పెరుగుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యుత్ ఛార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

స్ఫూర్తి నింపిన మహాసభలు

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించే వామపక్ష పార్టీల మహాసభలు ఈ వారంలో ఉత్సాహంగా జరిగాయి. కాకినాడ జిల్లా మహాసభల నేపథ్యంలో పెద్దాపురం పట్టణం ఎరుపెక్కిన విషయం విదితమే. వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు, ఉద్యోగులు పాల్గొన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సిపిఎం మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతో సహా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హాజరై దిశానిర్దేశం చేశారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ప్రజా చైతన్యంతోనే పాలకుల దుశ్చర్యలను అడ్డుకోగలమని పిలుపునిచ్చారు. నూతన కమిటీలతో సమరోత్సాహంతో ప్రజా సమస్యలపై పోరుకు కామ్రేడ్లు సన్నద్ధమయ్యారు.

విద్యతోనే దేశ భవిష్యత్

ప్రజాశక్తి - సామర్లకోట

దేశానికి అవసరమైన వస్తు సంపద, సేవా సంపదలను అందించేందుకు విద్యతో దేశ భవిష్యత్తు ముడిపడి ఉందని, నేటితరం విద్యార్థులు అందుకు కృషి చేయాలని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. గురువారం స్థానిక వైఆర్‌ఎల్ డిగ్రీ కళాశాల, మండలంలోని వేట్లపాలెం రామకృష్ణ ధ్యాన మందిరంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఒక జంతువు అయినా సృష్టిలో ఏ జంతువుకు లేని శరీర ఆకృతి, మేధస్సు మనిషికి మాత్రమే ఉందన్నారు. ఆ మేధస్సును పెంచుకునేందుకే విద్య అవసరం అన్నారు. విద్య ద్వారా సంపాదించిన మేధస్సును ధనార్జనకు గాక సమాజానికి మేలు కోసం ఉపయోగించాలన్నారు. సమాజంలో నూటికి 85 శాతం పిల్లలకు తెలివితేటలూ ఉన్నా వాటిని వినియోగించుకోలేక పోతున్నారన్నారు. విద్యార్థులంతా కులం, మతం, ప్రాంతం బాష అనే తారతమ్యాలను విడిచి పెట్టి తెలివికి సాన పెట్టి సమాజానికి ఉపయోగ పడాలన్నారు. పూర్వం పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్య నేర్పేందుకు ప్రాణం పెట్టేవారన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. తొలుత ప్రముఖ వైద్యులు, రచయిత డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఆర్‌ఎల్ కళాశాల ఛైర్మన్ డాక్టర్ మాణిక్యం, కరస్పాండెంట్ లక్ష్మిరాజ్యం, వివేకానంద సమితి నాయకులు కంటిపూడి గోపాలకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ వల్లూరి శ్రీనివాస్, సమితి నాయకులు, కళాశాల అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జయప్రకాష్ నారాయణ

రోగిని పరామర్శిస్తున్న ముదునూరి

పలువురికి 'ముదునూరి' పరామర్శ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలానికి చెందిన పలు కుటుంబాలను శనివారం ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్, వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. పోతులూరు గ్రామంలో ఇటీవల మరణించిన చిన్నం అచ్చిరాజు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే అనారోగ్యాలతో కాకినాడలో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వాకపల్లి గ్రామానికి చెందిన మురుకుర్తి అప్పన్న కుటుంబాన్ని, ధర్మవరం గ్రామానికి చెందిన పాస్టర్ బంగారాజును, మురుకుర్తి రాణిని పరామర్శించారు. రాణికి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులును కోరారు. ఈ కార్యక్రమంలో బర్ల గోవింద్, అవ్వ ఆదినారాయణ, జువ్వల దొరబాబు, బొల్లు నాగేశ్వరావు, మాగపు శివ పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థుల ఇండస్ట్రియల్ టూర్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి ఆటోమేటివ్ ట్రేడ్ విభాగం ఒకేషనల్ విద్యార్థులకు శనివారం ఇండస్ట్రియల్ టూర్ నిర్వహించారు. టూర్‌లో భాగంగా విద్యార్థులను ఒకేషనల్ ట్రైనర్ బి.మహేష్ ఆధ్వర్యంలో హోండా షోరూంలో మెకానికల్ విభాగంలో మెలకువలు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు వెన్నా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఒకేషనల్ విద్యార్థులకు పారిశ్రామిక రంగంలో మెలకువలు నేర్చుకునేందుకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.చిన్న బాబు, ముమ్వల లోవప్రసాద్, దలె వెంకట రమణ, డి.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

హోండా షోరూమ్‌ను సందర్శించిన విద్యార్థులు

కుటుంబ సభ్యులతో ఆడుతూ పాడుతూ గడపాలి

ప్రజాశక్తి - గండేపల్లి

సంక్రాంతి పండుగను గ్రామీణ ప్రాంతాల ప్రజలు కుటుంబ సభ్యులతో ఆడుతూ..పాడుతూ గడపాలని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలైన వివిధ రకాల జూదాలు, అశ్లీల నృత్యాలు, మత్తు పదార్థాలు వంటి వాటి జోలికి పోకుండా ఉండాలన్నారు. మహిళలు, బాలికలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ వంటి పోటీలను నిర్వహిస్తామన్నారు. అలాగే పురుషులకు కబాడీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని, మహిళలకు త్రో బాల్‌తోపాటు, కబాడీ పోటీలను నిర్వహిస్తామని చెప్పారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకూ ఈ పోటీలు నిర్వహించి 7వ తేదీ సాయంత్రం బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలు జగ్గంపేటలోని డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతాయని, సర్కిల్ పరిధిలోని గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. నిర్వహించడం జరుగుతుంది. అన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి ఒకటో తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆయా పోలీసు స్టేషన్లలోని మహిళా పోలీసులను సంప్రదించాలని కోరారు.

వల్లభస్వామికి రూ.1.70 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభ స్వామికి శనివారం ఒకరోజు వివిధ రూపాల్లో రూ.1,70,119 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టికెట్ల ద్వారా రూ.88,440, అన్నదాన విరాళాల ద్వారా రూ.60,464, కేశఖండన ద్వారా రూ.3,880, తులాభారం ద్వారా రూ.100, లడ్డు ప్రసాదం ద్వారా రూ.17,235 వెరసి రూ.1,70,119 ఆదాయం సమకూరిందన్నారు. యాత్రికులకు ఉదయం పులిహార, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్థులు సేవలందించారు.

ముగిసిన ఆరు రోజుల కార్యశాల

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్ అంశంపై నిర్వహించిన ఆరు రోజుల కార్యశాల శనివారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో అతిథి జె.లోవబాబు ఎపిఎస్‌ఎస్‌డిసి, ఎగ్జిక్యూటివ్ టెక్నికల్ ఇంజనీరింగ్ సభను మాట్లాడారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడారు. ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ సతీష్‌రెడ్డి ఎడబ్ల్యూఎస్ క్లౌడ్ కంప్యూటింగ్ ప్రాముఖ్యతను వివరించారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ అత్యాధునిక క్లౌడ్ కంప్యూటింగ్ సొల్యూషన్‌ను అందిస్తుందని, అది వ్యాపారాలు నిర్వహించే విధానాన్ని విప్లవాత్మకంగా మారుస్తుందని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్.ఎం.శ్రీనివాసరెడ్డి చెప్పారు.

జనవరిలో రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైయిన రమణయ్యపేట - జె అన్నవరం రహదారి నిర్మాణ పనులను జనవరిలో ప్రారంభిస్తామని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ తెలిపారు. శనివారం ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ చీఫ్ కె.నయీముల్లాతో కలిసి ధ్వంసం అయిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్లే రోడ్డు ఈ దుస్థితికి చేరుకుందన్నారు. రమణయ్యపేట నుంచి జె అన్నవరం వరకు పాడైపోయిన 11 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.22 కోట్ల నాబార్డ్ నిధులతో రోడ్డు నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ పర్యటనలో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు అల మండ చలమయ్య, బొద్దిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, పింద్రాల శ్రీను, ఏలేరు డిసి అధ్యక్షుడు ఎస్‌జివి.సుబ్బరాజు, టిడిపి నాయకులు బస ప్రసాద్, చిక్కాల లక్ష్మణరావు, పలివెల శ్రీనివాస్, మైరాల కనకారావు, బుద్ధ సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ సత్యప్రభ

ఎస్‌సి కులగణన నిబంధనలకు విరుద్ధం

ప్రజాశక్తి - కరప

ఎస్‌సి వర్గీకరణకు అనుకూలంగా ప్రభుత్వం చేపట్టిన కులగణన నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఎస్‌సి సంఘాల నాయకులు సాదే వీరరాఘవులు శనివారం ఓ ప్రకటనలో విమర్శంచారు. కరప గ్రామంలో ఉన్న ఎస్‌సిల పూర్తి సమాచారాన్ని పొందుపరచకుండా ఎస్‌సి కులగణన జాబితాను సచివాలయంలో ఏర్పాటు చేశారని అన్నారు. కరపలో అంబేద్కర్ నగర్, పంచాయతీ వద్ద ఉన్న ఎస్సీ కాలనీలకు సంబంధించిన 351 మందికి మాత్రమే కులగణన జరిగిందని, మిగిలిన కాలనీలు నక్క వారి పేట, రామ కంచిరాజు నగర్, పేపకాయల పాలెం, సీతమ్మ పేటల్లో ఉన్న ఎస్‌సి సామాజికవర్గం వారిని పరిగణనలోకి తీసుకోలేదన్నారు.

ముగిసిన విద్యార్థుల అభివృద్ధి శిక్షణా తరగతి

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో ఎపిఎస్‌ఎస్‌డిసి, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గేమింగ్ అంశంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. ఎపిఎస్‌ఎస్‌డిసి ఎగ్జిక్యూటివ్ ట్రైనర్ వై.రేవతి మాట్లాడుతూ బిల్డ్ బాక్స్ టూల్‌ని వాడే విధానంపై వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ ఛాన్సెలర్ అకాడమిక్స్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా సంజయ్ ఎస్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి. రాజేష్, విభాగాధిపతి డాక్టర్ కె.స్వరూప, కోఆర్డినేటర్ కె.రమేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు, చెప్పులు ఇవ్వాలి

ప్రజాశక్తి - యానాం

సోషల్ వెల్ఫేర్ శాఖ ద్వారా వద్దులకు ఉచితంగా అందించే దుస్తులు, చెప్పులను తక్షణమే ఇవ్వాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అర్ధాని దినేష్ కోరారు. శనివారం పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ శాఖ నుంచి వృద్ధులకు అందజేసే దుస్తులు, చెప్పులు మూడు నెలల క్రితమే వచ్చాయన్నారు. నాటి నుంచి వాటిని వృద్ధులకు ఇవ్వడం లేదని, గోదాముల్లో ఉన్న వాటిని ఎలుకలు పాడు చేస్తున్నాయని అన్నారు. తక్షణమే చర్యలు తీసుకుని వృద్ధులకు వాటిని అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విసికె పార్టీ సెక్రటరీ మెల్లం చిన్నా పాల్గొన్నారు.

ఆర్ఎఒకు వివరిస్తున్న దినేష్, చిన్నా

30న యానాం యూత్ క్రిస్మస్

ప్రజాశక్తి - యానాం

యానాం క్రిష్టియన్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 30న స్థానిక బస్ కాంప్లెక్స్ ఆవరణలోని మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో యానాం యూత్ క్రిస్మస్‌ను నిర్వహించనున్నట్టు ఎవాంజలిస్ట్ మారెళ్ల స్టీవెన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. యానాం, తాళ్లరేవు పాస్టర్ ఫెలోషిప్ ప్రార్థనా సహకారంతో యూత్ క్రిస్మస్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ జాన్ వెస్లీ పాల్గొని క్రిస్మస్ సందేశం ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - తాళ్లరేవు, పెద్దాపురం

సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో పోలేకుర్రు, గాడిమొగ, తాళ్లరేవు గ్రామాలకు సంబంధించి రెవెన్యూ సదస్సు జరిగింది. తహశీల్దార్ పి.త్రినాథరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జెసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి యూజర్ ఛార్జీలు లేకుండా రెవెన్యూ సేవలు అందించడంతోపాటు, ఇతర సమస్యల పరిష్కారం కొరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాల పరిమితి లోపల అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, తాళ్లరేవు మాజీ సర్పంచ్ రెడ్డి బాబు, డిటి సూరిబాబు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండలంలోని వాలు తిమ్మాపురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 10 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్య క్రమంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న జెసి రాహుల్‌మీనా

పండుగ పేరుతో జూదాలు నేరం

ప్రజాశక్తి - పిఠాపురం

పండగ పేరుతో జూదలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్య నేరమని సిఐ జి.శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని మోహన్ నగర్ టిడ్కో గృహ సముదాయాల వద్ద అసాంఘిక కార్యకలాపాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో కోడిపందాలు, గుండాట, పేకాట ఆడడం నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవున్నారు. ఇప్పటికే గతంలో కేసులు ఉన్న వారిని గుర్తించి బైండోవర్ చేస్తున్నామన్నారు. జూదల్లో పాల్గొని డబ్బు పోగొట్టుకోవడం వల్ల అది వారి కుటుంబపై ఎటువంటి ప్రభావితం చూపెడుతుందో వివరించారు. పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లులో ఎస్‌సి కులగణన సర్వే

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో అన్ని గ్రామాల పరిధిలో ఎస్‌సి కుల గణనను ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రచురించినట్టు ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. ఎస్‌సి కులాల జాబితాను స్వయంగా పరిశీలించుకుని ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31 తేదీ లోగా సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకుని సరిచేయించు కొనవలసినదిగా సూచించారు. దీనిపై మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం చేసినట్టు తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తక్షణమే సంబంధిత గ్రామాలకు చెందిన విఆర్‌ఒలకు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు.

కట్టా కుటుంబానికి వేణు పరామర్శ

ప్రజాశక్తి - కడియం

ఇటీవల మాత వియోగంతో బాధ పడుతున్న మండలంలోని వేమగిరికి చెందిన వైసిపి నాయకుడు కట్టా జమిందార్ కుటుంబాన్ని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ శనివారం పరామర్శించారు. కట్టా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలపారు. కట్టా విజయలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. పరామర్శించిన వారిలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, వైసిపి మండల అధ్యక్షుడు జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోనిాంద్రకోట గ్రామంలో శనివారం ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఎజిఎం డి.రవీంద్ర మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ, అధిక దిగుబడుల ద్వారా అధికాదాయం, గెలల కోత, నాణ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ ఆఫీసర్ డిఎల్.వెంకటేశ్వరరావు ఆయిల్ ఫామ్ మొక్కలు, ఎరువులపై రాయితీలు వంటి అంశాలు వివరించారు. ఈ సదస్సులో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఎం.వెంకటేశ్వరరావు, క్షేత్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల భారాల ఘనత జగన్‌దే

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యుత్ ఛార్జీల భారాలకు నాటి వైసిపి ప్రభుత్వ అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డే కారణమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, రామచంద్రపురం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు, రజక దాసరి సాధికార కమిటీల రాష్ట్ర కో-ఆర్డినేటర్ కాకినాడ రామారావు విమర్శించారు. శనివారం ఆయన పెద్దాపురంలో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పాలనలో జరుగుతున్న అభివృద్ధిని జగన్మోహన్‌రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారన్నారు.

1000 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మానవతా సేవా సంస్థ వివిధ రూపాలలో ప్రజలకు అందిస్తున్న సేవలు శిబిరాలు అవసరమైన వారు ఉపయోగించుకోవాలని మండల మానవత శాఖ గౌరవ ఛైర్మన్ సింహాద్రి జనార్ధనరావు అన్నారు. మానవత శాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం జిఎస్‌ఎల్ ఆసుపత్రి సహకారంతో తాళ్లపూడిలో శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని జనార్ధన రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అనేక రూపాల్లో సేవా కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో వెయ్యి మందికి వైద్య సేవలందించారు. సొలస సత్యనారాయణ దమయంతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన ఈ వైద్య శిబిరంలో జిఎస్‌ఎల్ ఆసుపత్రికి చెందిన వివిధ విభాగాలకు చెందిన 30 మంది వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఉచిత పరీక్షలతోపాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సేవా సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్ పాల్గొన్నారు.

పాస్ పోర్ట్ పడిపోయింది

పి గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామాని కి చెందిన కుసుమ సంపూర్ణ కుమారి W/o కుసుమ అర్జున్ రావు కు చెందిన **Y1469301** నెంబరు కల పాస్ పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము ఈ నెల 23వ తేదీన నరేంద్రపురం నుండి పి.గన్నవరం వచ్చుచుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్ కు అందజేయగలరు.

కుసుమ సంపూర్ణ కుమారి,
W/o కుసుమ అర్జున్ రావు,
నరేంద్రపురం,పి గన్నవరం మండలం-533229,
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్ :6301003659

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A. No. 208/2021 in A.S. No. 27/2021

Between:
మానేపల్లి సుబ్రహ్మణ్యం -పిటీషనర్/అపిలెంటు
మరియు
కవులూరి భవాని, వగైరా -రెస్పాండెంట్స్/ రెస్పాండెంట్స్

R-4: బేతల తులసి, W/o. రాజు, డో.నెం. 57-9-66, మల్లిఖార్జున నగర్, రాజమహేంద్రవరం.
R-8: మానేపల్లి చిరంజీవులు, W/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-10: మానేపల్లి రఘు, S/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-11: ఇంజరపు నాగమణి, W/o. సత్యనారాయణ, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-12: కోటిపల్లి వెంకటలక్ష్మి, W/o. వీరబాబు, డో.నెం. 11-4-21, వీర్రాఘవపురం, సామర్లకోట.

పై నెంబరు అప్పీలు పిటీషనులో శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపిన తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు పబ్లికేషను ద్వారా మీకు నోటీసు పంపడమైనది. కావున మీరు ది. **06-01-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు ఇచ్చెదరు.

టి.పి.ఆర్.చంద్రశేఖర్, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9440337629

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
A.S. No. 27/2021

Between:
మానేపల్లి సుబ్రహ్మణ్యం -అపిలెంటు
మరియు
కవులూరి భవాని, వగైరా -రెస్పాండెంట్స్

R-4: బేతల తులసి, W/o. రాజు, డో.నెం. 57-9-66, మల్లిఖార్జున నగర్, రాజమహేంద్రవరం.
R-8: మానేపల్లి చిరంజీవులు, W/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-10: మానేపల్లి రఘు, S/o. వెంకటేశ్వరులు, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-11: ఇంజరపు నాగమణి, W/o. సత్యనారాయణ, డో.నెం. 49-3-5, సామర్లకోట.
R-12: కోటిపల్లి వెంకటలక్ష్మి, W/o. వీరబాబు, డో.నెం. 11-4-21, వీర్రాఘవపురం, సామర్లకోట.

పై కేసులో కోర్టు వారు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపిన తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు పబ్లికేషను ద్వారా మీకు నోటీసు పంపడమైనది. కావున మీరు ది. **06-01-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు ఇచ్చెదరు.

టి.పి.ఆర్.చంద్రశేఖర్, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9440337629